కూరగాయల సాగుకు చేయూతేదీ?

- ఏడాది కాలంగా రాయితీ పథకాలు బంద్
- విత్తనాలు, డ్రిప్ పరికరాలపై సబ్సిడీ ఎత్తివేసిన ప్రభుత్వం
- సాగుపై ఆసక్తి చూపని రైతులు

చివ్వెంల: కూరగాయల సాగుకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువైంది. ఒకపక్క రాయితీ పథకాలు పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతోపాటు మరోపక్క సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించే సిబ్బందే లేకుండా పోయారు. ఇంకో పక్క ఎలాగోలా పండించిన ఉత్పత్తులను అమ్ముకునేందుకు మార్కెట్ల లేమి కారణంగా కూరగాలయ రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. దీంతో మండలంలో ఏటేటా కూరగాయల సాగు తగ్గుతూ వస్తోంది.

తగ్గిన సాగు విస్తీర్ణం..

మండలంలో ఏటా 600 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో కూరగాయలు సాగు చేసేవారు. కానీ రెండేళ్ల నుంచి అందులో సగం విస్తీర్ణంలో కూడా కూరగాయల తోటలు సాగు చేయని పరిస్థితి నెలకొంది. అయితే గతంలో కూరగాయల సాగుకు అవసరమైన రాయితీతో కూడిన విత్తనాలు, మొక్కలు, బిందు సేద్యం పరికరాలు, కూరగాయలు తరలించే ప్లాస్టిక్ పెట్టెలు, నారు పెంచే ట్రేలు, ఇలా పలు రకాలుగా రైతులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందేవి.


వాల్యతండా సాగు చేసిన దోసకాయ తోట

ఇప్పుడు వీటిలో ఏ ఒక్కటీ అందడం లేదని రైతులు వాపోతున్నారు.

రాయితీ పథకాలు అందక..

గత యేడాది వరకు పందిరి సాగు, మల్చింగ్ షీట్లపై రాయితీ అందించిన ప్రభుత్వం ఈసారి వీటికి నిధులు కేటాయించలేదు. ముఖ్యంగా కూరగాయల సాగుకు అవసరమైన బిందు సేద్యం పరికరాలపై ఐదేళ్లుగా ఎలాంటి రాయితీ లేకపోవడంతో రైతులు క్రమంగా సాగును తగ్గిస్తున్నారు. ఆరుతడి పంటల సాగుపై అవగాహన కల్పించడంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు విఫలం అవుతున్నారు. దీంతో కూరగాయల సాగుపై రైతులు అనాసక్తి చూపుతున్నట్టు తెలుస్తోంది. పైగా రైతులు కూరగాయలు పండించాడానికి ఎంత కష్ట పడుతున్నారో. వాటిని మార్కెట్‌కు తరలించి విక్రయించడానికి కూడా అంతకంటే ఎక్కువ ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఒకపక్క రవాణా, మరోపక్క మార్కెట్ సౌకర్యాలు లేక తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తీరా ఏదో ఒక మార్కెట్‌కు వెళితే అక్కడ కనీస ధర అందడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రాయితీ పథకాలతోపాటు ప్రోత్సాహకాలు అమలు చేసి తమను ఆదుకోవాలని వివిధ గ్రామాలకు చెందిన కూరగాయలు సాగు చేసే రైతులు కోరుతున్నారు.

రాయితీలు అందించాలి

కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయితీపై డ్రిప్ పరికరాలు, విత్తనాలు ఇవ్వాలి. దీనికి తోడు దళారీ వ్యవస్థ లేకుండా చూడాలి. రైతులు పండించిన పంటలకు కనీసం ధర అందేలా చర్యలు తీసుకోవాలి.

– ధరావత్ టీకం నాయక్, లక్ష్మణ్‌నాయక్ తండా.

ఏడాది నుంచి రాయితీలు నిలిపివేశారు

కూరగాయల సాగుకు ఇచ్చే రాయితీలను ప్రభుత్వం గత సంవత్సర కాలం నుంచి నిలిపి వేసింది. దీంతో రైతులకు కూరగాయల సాగుపై రాయితీలు ఇవ్వడం లేదు. పండ్ల సాగు, పామాయిల్ సాగుకు రాయితీలు కల్పిస్తున్నాం.

– కన్నా జగన్, ఉద్యానవన శాఖ అధికారి, సూర్యాపేట

అంగన్‌వాడీలకు 'ఆసరా' హర్షణీయం


మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు

సూర్యాపేట: రిటైర్డ్ అంగన్‌వాడీ టీచర్లకు తెలంగాణ ప్రభుత్వం ఆసరా పింఛన్లు ఇస్తామని ప్రకటించడం హర్షణీయమని బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వెంపటి గురూజీ, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నాగలక్ష్మి అన్నారు. సోమవారం సూర్యాపేటలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆ సంఘం నాయకులు మంత్రి జగదీశ్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం వారు మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ తంతెనపల్లి సుజాత, జిల్లా ఉపాధ్యక్షురాలు సోమగాని రమణ, గుండగాని సుజాత, సెక్టార్ బాధ్యులు గాదె శైలజ, అనసూయ, సలోమి, ఇందిరా, శారద, జ్యోతి, సావిత్రి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో కేంద్ర బృందం సందర్శన

సూర్యాపేట టౌన్: జిల్లాలో కొనసాగుతున్న ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ) అసెస్‌మెంట్ సర్వేలో భాగంగా సోమవారం పలు పాఠశాలలను కేంద్ర బృందం సభ్యులు మౌనిక, సబినా, షాలెట్ సందర్శించారు. సూర్యాపేట మండలం టేకుమట్ల, సీతారాంపురం, దురాజ్‌పల్లి, సత్రంబజార్, చివ్వెంల మండలం బీబిగూడెం స్కూళ్లను సందర్శించి సర్వే పరిశీలించారు. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌జీ సభ్యుడు సైదిరెడ్డి, సెక్టోరియల్ అధికారి జనార్దన్, డీఆర్‌పీ లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.


టేకుమట్ల ప్రాథమిక పాఠశాలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

ఆర్టీసీ కార్మికుల హక్కులను పరిరక్షించాలి

భానుపురి (సూర్యాపేట) : ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ ఆమోదించిన బిల్లు విధివిధానాలు సంస్థ, కార్మికుల హక్కులను పరిరక్షించేలా ఉండాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బత్తుల సుధాకర్ అన్నారు. ఆర్టీసీ కార్మికుల విలీనం, ఆంధ్రప్రదేశ్ అనుభవాలు, ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రతిపాదనలు తదితర అంశాలతో సంఘం రాష్ట్ర కమిటీ ముద్రించిన బుక్‌లెట్‌ను సోమవారం జిల్లాకేంద్రంలోని డిపోలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ట్లూ. అనంతరం డిపో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్), డిపో కార్మికులకు బుక్‌లెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం డిపో కార్యదర్శి ఉప్పు లక్ష్మయ్య, సహాయ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి బైరు శ్రీకంట్లం, ప్రచార కార్యదర్శి పరశురాములు, మల్లయ్య, భాస్కర్, వీరయ్య, యాదగిరి, మునీరు, వెంకన్న, సైదులు, ఉమాదేవి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.


బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మంత్రి జగదీష్‌రెడ్డికి బుద్ధి చెప్పడం ఖాయం

- వట్టె జానయ్యపై 71 కేసులు అమానుషం
- భారత యాదవ్ సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్

మద్దిరాల: డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్‌పై అక్రమ కేసులు పెట్టిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో యాదవ సమాజం తగిన బుద్ధి చెప్పడం ఖాయమని భారత యాదవ్ సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిటి మహేష్ యాదవ్ అన్నారు. సోమవారం మద్దిరాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ వర్గానికి రాజ్యాధికారం కావాలని అన్నందుకు రాజకీయంగా తనకు ఎక్కడ అడ్డుగా వస్తాడోనని మంత్రి జగదీష్‌రెడ్డి కక్షగట్టి జానయ్యపై 71 కేసులు పెట్టించడం అమానుషమని పేర్కొన్నారు. అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోకుంటే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో సమితి నాయకులు నాగరాజు, యాకయ్య, అవిలయ్య, సురేష్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అమర వీరులకు నివాళి


తుంగతుర్తిలో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

తుంగతుర్తి: తెలుగుదేశం ప్రభుత్వం హయాంతో పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా బషీర్‌బాగ్‌లో చేపట్టిన నిరసన ర్యాలీలో జరిగిన కాల్పుల్లో మరణించిన అమరవీరుల చిత్రపటాలకు సోమవారం మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, జిల్లా కమిటీ సభ్యులు బుర్ర శ్రీనివాస్, కందాల శంకర్‌రెడ్డి, తాటి విజయమ్మ, మేడె ప్రభాకర్, రమేష్, నాగమ్మ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్ల బలోపేతానికి సహకరించాలి

అర్వపల్లి: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు సహకరించాలని జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కె.తబిత కోరారు. రామన్నగూడెం గ్రామానికి చెందిన జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్ఎస్ స్కూల్ అసిస్టెంట్ నాయిని మంజుల కుమార్తె, ఎన్ఆర్ఐ కట్టంగూర్ కావ్య సోమవారం జాజిరెడ్డిగూడెం, అర్వపల్లి స్కూళ్లలో టెన్త్‌లో అత్యధిక మార్కులు పొందిన నిమ్మల మానస, పాక మాధవి, కాగితాల అక్షరజ్వాల, పొట్టిపాక రాకేష్, ఆల్డాస్ లింగరాజు, ధరావత్ అంజలిలకు ఒక్కొక్కరికీ రూ.5వేల చొప్పున మొత్తం రూ.30 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా కావ్యకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం జిల్లా ప్రసాద్, ఎస్ఎంసీ చైర్మన్లు అరిగె నాగరాజు, మామిడి నాగరాజు ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, మంజుల, పీడీ సోమయ్య, ఇందిరమ్మ, ఉమ, ప్రసన్న, రాజ్యలక్ష్మి, వెంకటేశ్వర్లు, లింగస్వామి, సంపత్, రజని, వెంకట్, చంద్రకళ, జలేంధర్, ప్రకాశం పాల్గొన్నారు.


జాజిరెడ్డిగూడెంలో విద్యార్థినికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎన్ఆర్ఐ కావ్య

భానుపురిలో ముగిసిన తీజ్ వేడుకలు


తీజ్ వేడుకల్లో పాల్గొన్న గిరిజన యువతులు

భానుపురి (సూర్యాపేట): జిల్లా కేంద్రంలోని 16వ వార్డు ముత్యాలమ్మ గుడి వద్ద బంజారా తీజ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న తీజ్ వేడుకలు సోమవారం సాయంత్రం ముగిశాయి. మొదటి రోజు బంజారా యువతులు, మహిళలు గోధుమ నారువేసి, ఎనిమిదో రోజు బంజారా ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్‌కు నైవేద్యం సమర్పించి భోగ్ బందర్ చేశారు. చివరి రోజు నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సివిల్ సప్లయ్ డీఎం రాంపతి, డీఏఓ రామారావునాయక్ హాజరై మాట్లాడుతూ బంజారాలకు అతిపెద్ద పండుగ తీజ్ పండుగ అని పేర్కొన్నారు. అనంతరం గిరిజన యువతులు, మహిళలు, చిన్నారులు ఆడుతూ పాడుతూ నృత్యాలు చేస్తూ ర్యాలీగా సద్దుల చెరువు వద్దకు చేరుకొని ప్రత్యేకంగా అలంకరించిన గోధుమ బుట్టలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో తీజ్ ఉత్సవ కమిటీ కన్వీనర్ డి.మంగ్య, గౌరవ అధ్యక్షులు డి.వీరన్న, సభ్యులు పి.ధారాసింగ్, బి.నాగు, జి.హుస్సేన్, డి.అజయ్ కుమార్, డి.లాలు, బి.బాలాజీ, డి.లాలు, డి.రఘుపతి, బి.దేవా, డి.పాండు, డి.లక్పతి, ఆర్.సోమని, డి.రవీందర్, దరవత్ దేవా నాయక్ పాల్గొన్నారు.

పింఛన్లను రూ.6 వేలకు పెంచాలి


పాతర్లపహాడ్‌లో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూర్ (ఎస్): ప్రభుత్వం అందించే అన్నిరకాల పింఛన్లను రూ.6వేలకు పెంచాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.జహీర్‌బాబా కోరారు. సోమవారం మండలంలోని పాతర్లపహాడ్ గ్రామంలో వీహెచ్‌పీఎస్ 16వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. గృహలక్ష్మి పథకంలో వికలాంగులకు 5శాతం రిజర్వేషన్, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, అంత్యోదయ కార్డులు, ప్రత్యేక పాఠశాలలు, ఉచిత విద్యుత్తు, రవాణా సౌకర్యం, వికలాంగుల బంధ్‌ను ప్రభుత్వం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కేశబోయిన మల్లయ్యయాదవ్, బీజేపీ గ్రామశాఖ అధ్యక్షులు గుంటూరు వీరస్వామి, వీహెచ్‌పీఎస్ గ్రామశాఖ అధ్యక్షులు వత్సవాయి కొమరయ్య, మండల ఉపాధ్యక్షులు ఎలగందుల కృష్ణమూర్తి, మండల నాయకులు గాదగాని భిక్షపతి, పాండవుల లింగయ్య, బూడిద రామచంద్రు పాల్గొన్నారు.

తుంగతుర్తిలో మూడోసారి బీఆర్ఎస్‌దే గెలుపు


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

తుంగతుర్తి: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గంలో మూడోసారి కూడా గెలిచేది ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యేపై ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను మానుకోవాలన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో తుంగతుర్తి నియోజకర్గం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గుండగాని రాములుగౌడ్, నల్లు రామచంద్రారెడ్డి, కటకం వెంకటేశ్వర్లు, దొంగరి శ్రీనివాస్, గోపగాని రమేష్, తునికి సాయిలు, దుర్గయ్య, భిక్షం, శ్రీనివాస్, రవికుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

బీసీ వాదం లేవనెత్తడం హాస్యాస్పదం

భానుపురి (సూర్యాపేట): దళితులు, బడుగు, బలహీన వర్గాల భూములను కబ్జా చేసిన వట్టె జానయ్య యాదవ్ బీసీవాదం లేవనెత్తడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి యాతాకుల రాజయ్య మాదిగ అన్నారు. సోమవారం పట్టణంలోని జగ్జీవన్‌రాం భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి కోట్లాది రూపాయల విలువ చేసే భూములను జానయ్య యాదవ్ లాక్కున్నారన్నారు. ముందుగా తాను ఆక్రమించిన భూములన్నింటినీ ఎవరివి వారికే పంచాలన్నారు. లేదంటే ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, పీడీ యాక్ట్ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో చినశ్రీరాములు, ములకలపెల్లి మల్లేష్, కనుకుంట్ల వెంకన్న, పుట్టల మల్లేష్, బొజ్జ సైదులు, బోడ శ్రీరాములు, సావిత్ర, నాగేశ్వరి, బొడ్డు విజయ్, దాసరి వెంకన్న, దైద వెంకన్న, శ్రీను, గ్యార కనకయ్య, నవీన్, చెన్నమ్మ, మధు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజయ్యమాదిగ

సింహగర్జన సభను విజయవంతం చేయాలి

నూతనకల్: సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే బీసీల సింహగర్జన సభను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంబాబు కోరారు. సోమవారం నూతనకల్ మండల కేంద్రంలో సింహగర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు జనాభా ప్రాతిపదికన 60సీట్లు కేటాయించాలన్నారు. బీసీ అభ్యర్థినే ముఖ్యమంత్రిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, విద్యా, సామాజిక రంగాల్లో బీసీలకు ప్రాతినిత్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు బ్రహ్మాండ్లపల్లి భవానిశంకర్, బొల్క కొమరయ్య, బ్రహ్మాండ్లపల్లి మధు, మట్టిపల్లి సందీప్, రాజేష్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం నాయకులు

మొలుగూరి వెంకయ్య మృతికి సంతాపం

పెన్‌పహాడ్: మండలంలోని తంగెళ్లగూడెం గ్రామంలో అనారోగ్యంతో మృతిచెందిన సీపీఎం సీనియర్ నాయకులు మొలుగూరి వెంకయ్య(85) పార్థివదేహంపై సోమవారం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు ఎండా జెండా కప్పి నివాళులర్పించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చినపంగి నర్సయ్య, వీరబోయిన రవి, రాంబాబు, రణపంగ కృష్ణ, మడ్డి అంజిబాబు, గుర్రం గోపాల్‌రెడ్డి, బొమ్మిరెడ్డి గోపిరెడ్డి, కొండమీది రాములు, మొలుగూరి సోమయ్య, సుధాకర్, అబ్బగాని భిక్షం, సైదులు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించాలి

పెన్‌పహాడ్: విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలను పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తొలిమెట్టు మానిటరింగ్ పరిశీలకులు షేక్ రేష్మా, షేక్ ఆసియా కోరారు. సోమవారం మండలంలోని మున్యాతండా ప్రాథమిక, దోసపహాడ్ యూపీఎస్‌ను సందర్శించి 3వ తరగతి విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల కనీస సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదవడం, రాయడం తప్పనిసరిగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నకిరేకంటి రవి, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు వెంకన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆచారి, రాములు, సీఆర్పీలు సైదయ్య, నాగు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న మానిటరింగ్ పరిశీలకులు

మృతుల కుటుంబాలకు పరామర్శ


లోయపల్లిలో నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం లోయపల్లి, పూర్యాతండా, నాణ్యతండాల్లో ఇటీవల మరణించిన బీఆర్ఎస్ నాయకుల కుటుంబాలను సోమవారం జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులలర్పించిన వారిలో గ్రామ శాఖల అధ్యక్షులు ఆర్.నాగునాయక్, గాదరి వెంకన్న, ఉపసర్పంచ్ వీరస్వామి, నాయకులు మంచాల నర్సయ్య, జి.రవి, శేఖర్‌రెడ్డి, లింగాచారి, సత్యనారాయణ, కేలోతు రవీందర్‌నాయక్, గోవర్ధన్, శ్రీను, రాజు తదితరులు ఉన్నారు.

నూతనకల్: మండలంలోని యడవెళ్లి గ్రామంలో ఇటీవల మృతిచెందిన గాజుల వీరయ్య కుటుంబ సభ్యులను సోమవారం బీఆర్ఎస్ నాయకులు కలిసి పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులకు క్వింటా బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గాజుల తిర్మల్‌రావు, ఎంపీటీసీ వేల్పుల నరేష్, తూముల వెంకటేశ్వర్‌రావు, గాజుల దేవమ్మ, దాసరి కళమ్మ, బొడ్డు వెంకన్న, పిట్టల జానయ్య, గాజుల ఆంధ్రయ్య ఉన్నారు.

'ఎమ్మెల్యే కిషోర్‌పై ఆరోపణలు మానుకోవాలి'

అర్వపల్లి: తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌పై ఓయూ నాయకుడు పాల్వాయి నగేష్ చేస్తున్న తప్పుడు ఆరోపణలు మానుకోవాలని బీఆర్ఎస్ మండల నాయకుడు బోయిళ్ల తిరుమల్‌మాదిగ అన్నారు. సోమవారం ఆయన అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే కిషోర్ కృషి వల్లే నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది గోదావరి జలాలతో సస్య శ్యామలంగా మారిందన్నారు. రాజకీయంగా లబ్ధి పొందడానికే ఎమ్మెల్యేపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో కిశోర్ భారీ మెజార్టీతో గెలిచి హాట్రిక్ సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకుంటున్నాం..


మాట్లాడుతున్న బొమ్మిడి లక్ష్మీనారాయణ

సూర్యాపేట: రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పాలనలో స్వేచ్ఛాయుత వాతావరణంలో వ్యాపారాలు చేసుకుంటున్నామని సూర్యాపేట కిరాణా మర్చెంట్స్ అసోసియేషన్ నేత, వ్యాపార వేత్త బొమ్మిడి లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం సూర్యాపేటలోని క్యాంపు కార్యాలయంలో పలువురు వ్యాపారులతో వెళ్లి మర్యాద పూర్వకంగా మంత్రి జగదీష్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల హయాంలో రౌడీల బెదిరింపులు, మామూళ్ల కోసం దౌర్జన్యాలతో అనుక్షణం బిక్కుబిక్కుమంటూ గడిపామన్నారు. నేడు వ్యాపార వర్గాలకు రౌడీల వేధింపుల నుంచి విముక్తి కల్పించింది జగదీష్ రెడ్డి అని కొనియాడారు.

పీఎఫ్‌పై అవగాహన సదస్సు

భానుపురి (సూర్యాపేట): నిధి ఆప్కే నికట్ 2.0 కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్)పై అవగాహన సదస్సు నిర్వహించారు. జనవరి నుంచి దేశవ్యాప్తంగా అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. సదస్సులో ఎస్ఎస్ఎస్ఏ నాగు నాయక్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ధనుంజయ్, నోడల్ ఆఫీసర్ అశోక్, సిబ్బంది పి.పాపయ్య పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న రామచంద్రయ్య

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మండల కేంద్రంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవన నిర్మాణానికి ఆ సంఘం నాయకులకు సోమవారం బీజేపీ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య రూ.లక్ష విరాళం అందజేశారు.కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు సర్సయ్య, సత్తిరెడ్డి, వెంకట్‌రెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

మద్దిరాల: విద్యార్థులు కష్టపడితే చదివితేనే విజయం సొంతం అవుతుందని ఎస్ఐ ఏ.రవీందర్ అన్నారు. సోమవారం మద్దిరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చార్లెట్స్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, బిస్కెట్స్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి జేసీస్సీ లాజిస్టిక్స్ డైరెక్టర్ జాటోత్ శేఖర్, సురేందర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం


చెక్కు అందజేస్తున్న ఎంపీపీ రేణుక

అర్వపల్లి: సీఎం సహాయనిధి పథకం పేదలకు వరం లాంటిదని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ అన్నారు. మండలంలోని కుంచమర్తి గ్రామానికి చెందిన గోగుల రేణుక అనారోగ్యానికి గురి కావడంతో వైద్య ఖర్చుల కోసం ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ సీఎం సహాయ నిధి నుంచి మంజూరు చేయించిన రూ.14 వేల చెక్కును సోమవారం ఆమె భర్త గోగుల యల్లయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉగ్గం ఉపేంద్రలింగరాజు, మహంకాళి సురేష్, మన్నె వీరయ్య, ఉగ్గం నాగరాజు, మన్నె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక జన్మదిన వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న సంఘం నాయకులు

భానుపురి (సూర్యాపేట): జిల్లా కేంద్రంలోని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో సోమవారం ఐదుగురు పెన్షనర్ల సామూహిక జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు దండా శ్యాంసుందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు, కోశాధికారి హమీద్‌ఖాన్, కోదాడశాఖ అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు వి.కృపాకర్ రెడ్డి, టి.లక్ష్మీకాంతారెడ్డి, మండల కార్యదర్శి సుధగాని నాగేశ్వర్‌రావు, జి.సోమయ్య, వి.రాములు, కె.సురేందర్‌రెడ్డి, వీరయ్య కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సూర్యక్షేత్రం సందర్శన


సూర్యక్షేత్రంలో సూర్యాపేట సంతోషిమాత ఆలయ కమిటీ సభ్యులు

అర్వపల్లి: రాష్ట్రంలోని తొలి సూర్యక్షేత్రమైన తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రాన్ని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీసంతోషిమాత దేవాలయం కమిటీ సభ్యులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా క్షేత్రంలో సూర్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. క్షేత్ర విశిష్టతను సూర్యక్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంతోషిమాత దేవాలయ అధ్యక్ష, కార్యదర్శులు నూక వెంకటేశంగుప్త, బ్రహ్మాండపల్లి మురళిధర్, ఉపాధ్యక్షులు పబ్బ ప్రకాష్‌రావు, బెలిదె అశోక్, అన్నదాన నిర్వాహకులు కొత్త మల్లిఖార్జున్, కమిటీ సభ్యులు బోనగిరి విజయ్‌కుమార్, గోపారపు రాజు, దేవాలయ మేనేజర్ బచ్చు పురుషోత్తం, అర్చకులు పాల్గొన్నారు.

క్రీడాపోటీలను విజయవంతం చేయాలి

అర్వపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పాటు జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో జరిగే పాఠశాలల మండల స్థాయి క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంఈఓ బి.బాలునాయక్ కోరారు. సోమవారం జాజిరెడ్డిగూడెం ఎమ్మార్సీలో పీఈటీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం బాలికలకు, బుధవారం బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు ఉంటాయని చెప్పారు. ఈ సమావేశంలో పీడీ ఎం.సోమయ్య, పీఈటీలు లింగాల రవి, ఎల్.సైదులు, కె.లలిత, బోయిళ్ల సైదులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న విద్యార్థిని

పెన్‌పహాడ్: సౌర శక్తి వినియోగించడం ద్వారా విద్యుత్ ఆదాయం చేసుకోవచ్చనే అంశంపై హైదరాబాద్‌లో సైఫాబాద్‌లో గల హోం సైన్స్ కళాశాల విద్యార్థినులు సోమవారం మండలంలోని దూపహాడ్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలు విషయాలను వివరించారు. సోలార్ వీధి దీపాలు, సోలార్ మోటార్ల గురించి మోడల్ రూపంలో చూపించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు మనాగ్న, శ్వేత, పుష్ప, దీపికరెడ్డి, దివ్య, వైష్ణవి, శివాని, భాగ్యశ్రీ, శార్వాణి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.